డబ్బున్న వాళ్లకి ఒక పేద మనిషి కంటే వాళ్లు పెంచిన కుక్క ఎక్కువ విలువయినదని అనుకుంటారు. అయితే ఆ ఊహ కూడా తప్పని చెప్పే కథ.

# ప్రాణం ఖరీదు

ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురింపబడిన కథ

పుట్టగంటి గోపీకృష్ణ



రకరకాల వాహనాలతో క్రాస్‌రోడ్ రద్దీగా ఉంది. సిగ్నల్ లైటు ఎరుపు రంగుకు మారింది. వాహనాలన్నీ వేగం తగ్గించుకుంటున్నాయి.

ఒక ఎరుపు రంగు ఇన్నోవా కారు మాత్రం ఏ మత్రం వేగం తగ్గించకుండా అడ్డంగా ఉన్న రెండు మూడు చిన్న కార్లను రాసుకుంటూ ముందుకెళ్లి, రోడ్డు మీద అడ్డంగా వస్తున్న ట్రాఫిక్‌ను పట్టించుకోకుండా, వాటి మధ్య నుండి ముందుకు వెళ్తోంది.

ఇన్నోవా తగిలిన కార్లు అడ్డదిడ్డంగా మెలికలు తిరిగి ఆగాయి. ఇన్నోవాని వెంబడిస్తున్న పోలీసు వాహనాలు గుండ్రంగా తిరిగి ఆగబోతున్న కారుల్ని మరొకసారి గుద్ది అవి కూడా ట్రాఫిక్ దాటబోయాయి.

హఠాత్తుగా సిగ్నల్‌కి వ్యతిరేకంగా దూసుకు వచ్చిన ఈ వాహనాల దెబ్బకి ట్రాఫిక్ ఒక్కసారిగా కకావికలమయింది. సడన్ బ్రేక్‌తో ఆగిన వాహనాలను, వెనుక నుండి వచ్చిన వాహనాలు గుద్దుకుని ఆగుతున్నాయి. ఇన్నోవా మాత్రం డ్రైవింగ్ నైపుణ్యం చూపిస్తూ ట్రాఫిక్ దాటగలిగింది. వెంబడిస్తున్న పోలీసు జీపులు ట్రాఫిక్‌ని తప్పించ లేక చాలా వాహనాలను గుద్దేశాయి.

ఈ గందరగోళంలో ఒక పోలీసు జీపు క్రాస్‌రోడ్ మధ్య నిలబడి ఉన్న కానిస్టేబుల్ మీదకి దూసుకు వచ్చింది. అతి వేగంతో తన మీదకు దూసుకు వస్తున్న జీపును చూసి, ఎగిరి పక్కకు దూకి తన ప్రాణాలు కాపాడుకున్నాడు ఆ పోలీస్ కానిస్టేబుల్. జీపు కంట్రోల్ తప్పి, అటుఇటూ మెలికలు తిరిగి, నాలుగు రోడ్ల మధ్యలో నిలబెట్టి ఉన్న ట్రాఫిక్ పోస్టును ముక్కలు చేస్తూ, రోడ్డుకు పక్కకు వెళ్లి పల్టీ కొట్టి ఆగింది.

"కట్...కట్..." అన్న కేక మెగాఫోన్‌లో వినపడగానే ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోయాయి.

పల్టీ కొట్టి ఆగిన జీపు వైపు ఇద్దరు ముగ్గురు సేఫ్టీ అసిస్టెంట్స్ పరుగెత్తారు. ఈలోపే దాంట్లో నుండి డ్రైవర్ తలుపు తీసుకుని దిగాడు.

స్టంట్ మాస్టర్ నరసింహం ఒకసారి డ్రైవర్లందరు క్షేమంగ ఉన్నారని రూఢి చేసుకున్న తరువాత, దూరంగా కెమేరా వెనుక గొడుగు కింద కూర్చున్న డైరెక్టర్ వైపు నడిచాడు.

డైరెక్టర్ మహేష్ తెలుగు ఇండస్ట్రీలో బాగా డిమాండ్ ఉన్న దర్శకుల్లో ఒకడు. తీసింది నాలుగు సినిమాలే అయినా దాదాపు అన్నీ విజయవంతం అవటంతో మంచి ఊపు మీద ఉన్నాడు. అతని సినిమాలన్నీ టేకింగ్ పరంగా వెరైటీగా ఉంటాయని పేరు. సాంకేతిక నైపుణ్యాన్ని ఎంతవరకు



ఉపయోగించుకోవాలో అతన్ని చూసి నేర్చుకోవాలని అనుకుంటూ ఉంటారు సినీ ఫీల్డులో అందరు. యువతలో క్రేజ్ సంపాదించిన మహేష్ సహజంగానే పెద్ద హీరో, హీరోయిన్లకి ఫేవరెట్‌గా మారాడు.

“మనం ఎంత ఖర్చు పెట్టామన్నది ముఖ్యం కాదు, ఆ ఖర్చు తెర మీద ఎంత బాగా కనిపించిందన్నదే ముఖ్యం. ఇంత గ్రాండ్ రోడ్డు, ఇన్ని వెహికిల్స్... ప్రేక్షకుడు తెర మీద గుర్తించే లోపే, కెమెరా వేగంగా క్లోజప్‌లోకి వెళ్ళి పోయింది.” కెమెరామేన్‌తో అసంతృప్తిగా అంటున్నాడు మహేష్, అప్పటివరకు తీసిన షాట్ మానిటర్‌లో చూస్తూ.

“కొంచెం ఫాస్ట్‌గా కెమేరా మూవ్ అయిన మాట వాస్తవమే సర్! లేకపోతే ఇంత మంచి యాక్షన్ షాట్ లాంగ్ షాట్ అయిపోయేది. వేరే కెమేరాలో ఎలా వచ్చిందో చూద్దాం...”

“ఒక పని చెయ్యండి. తరువాతి షాట్ రెడీ అయ్యేలోపు నార్మల్ ట్రాఫిక్ మూవ్‌మెంట్ కాప్చర్ చెయ్యండి. దాన్ని ఈ షాట్ ముందు కలుపుదాం! సరిపోతుంది...”

‘అందుకే ఇంత చిన్న వయసులో అంత పెద్ద డైరెక్టర్ అయ్యాడు.’ అనుకున్నాడు కెమేరామేన్. ప్రతీ విషయం సూక్ష్మంగా ప్రేక్షకుల దృష్టితో పరిశీలిస్తాడు మహేష్. అందరినీ కలుపుకుని పోతాడని పేరున్నా, తను అనుకున్న ఎఫెక్ట్ వచ్చేవరకు కాంప్రమైజ్ కాడనీ, బడ్జెట్ గురించి పట్టించుకోడనీ అంతే అపఖ్యాతి ఉంది. కాకపోతే అతనికి ఆ మాట చెప్పగలిగే ధైర్యం మాత్రం ఎవరికీ లేదు.

అంతలోనే అతనికి ఏదో ఆలోచన వచ్చినట్లుంది. అసిస్టెంట్ డైరెక్టర్‌ని పిలిచాడు. “ఇందాక షాట్‌లో కానిస్టేబుల్ పక్కకి దూకాడు కదా! మొహమంతా దుమ్ము కొట్టుకు పోయి, షాక్ తగిలినట్లు ఫేస్ పెట్టిన కానిస్టేబుల్ని ఒక క్లోజప్ షాట్ తియ్యండి. చిన్న పిల్లలు ఎంజాయ్ చేస్తారు...” అని అతనితో చెప్పాడు.

“అలాగే సార్! ఏమనుకోకపోతే ఒక సలహా. ఆ షాట్ తరువాత, అతని పక్కన వేగంగా వెళ్తున్న వెహికిల్ టైర్ బురద గుంటలో పడినట్లు చూపిద్దాం సార్. బురద కూడా మీద పడితే ఇంకా బాగుంటుంది...”

“చెప్పినవరకు చెయ్యవయ్యా...” విసుగ్గా అన్నాడు మహేష్.



'అంత ట్రాఫిక్ జామ్‌లో వెహికిల్ వేగంగా ఎలా వెళ్తుందో, అంత సోఫిస్టికేటెడ్‌గా కనిపిస్తున్న రోడ్డు మధ్య బురద గుంట ఎలా ఉంటుందో అన్న ఆలోచన కూడా లేనివారు డైరెక్టర్లు అవుతున్నారు...' అనుకున్నాడతను.

తన వైపు వస్తున్న స్టంట్ మాస్టర్ నరసింహాన్ని చూసి, "తరువాత షాట్ ఏం ప్లాన్ చేశారు?" అని అడిగాడు.

"ఇదే ముఖ్యమయిన షాట్ సార్. జీబ్రా క్రాసింగ్ దగ్గర చాలా మంది రోడ్డు దాటుతూ ఉంటారు. ఒక పక్క హీరోయిన్ గారు తన కుక్కతో వస్తుంటుంది. మరొక వైపు ఏడెనిదిమేళ్ల స్టూడెంట్, చూపులేని ముసలి వ్యక్తిని రోడ్డు దాటిస్తూ ఉంటుంది..."

"కుక్క అనంట అనమాకయ్యా! హీరోయిన్‌కి కోపం వస్తుంది. అందులో అది హీరోయిన్ గారి ఫేవరెట్ 'గోల్డెన్ రిట్రీవర్'. దాని పేరు స్వీటీ అనుకుంటా. అది ఆవిడ స్వంత కుక్కయ్యా బాబూ..."

"అలాగే సర్!" అని కొన్ని క్షణాలాగి, "షాట్‌లోకి వెళ్తే... వేగంగా వచ్చిన హీరో గారి ఇన్నోవాకి స్టూడెంట్, ముసలి వ్యక్తి అడ్డు వస్తారు. వాళ్లని తప్పిస్తూ ఇంకొక వైపు వెళ్దామంటే హీరోయిన్ స్వీటీతో వస్తూ ఉంటుంది. అందుకని హీరో కారుకి సడన్ బ్రేక్ వేయటంతో కారు గిరికీలు కొట్టుకుంటూ, హీరోయిన్ దగ్గరకు వచ్చి ఆమెను ఆనుకుని ఆగిపోతుంది. ఇంతలో వెనుక నుండి వచ్చిన పోలీసులు హీరోని పట్టుకుంటారు."

"కట్ చేస్తే తన స్వీటీ కోసం పోలీసులకు దొరికిపోయిన హీరోతో, హీరోయిన్‌కి డ్రీమ్ సాంగ్. అన్నట్లు స్వీటీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయా? అసిస్టెంట్ డైరెక్టర్ రమణ ఏడీ? అతన్ని రెగ్యులేషన్స్ కంప్లీట్ చేయించమని చెప్పాను. అయ్యాయా?"

"స్వీటీ రెడీగా ఉంది సార్. డాక్టర్ కూడా వచ్చాడు. హెల్త్ సర్టిఫికెట్ తీసుకున్నాను." స్వీటీని దువ్వుతూ చెప్పాడు రమణ.

'వీడు స్వీటీని పట్టుకుని హీరోయిన్ అని ఫీలయి పోతున్నాడు...' అనుకున్నాడు స్టంట్ మాస్టర్ నరసింహం.

జంతువులతో షూటింగ్ చేయాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. అందుకే ఈ మధ్య సినిమాలలో జంతువులను చూపించటం పూర్తిగా తగ్గి పోయింది. ఒక కుక్కని షూటింగ్‌కి వాడాలంటే, ముందు యానిమల్ వెల్ఫేర్ బోర్డు నుండి దాని ఆరోగ్యం బాగుందని క్లియరెన్స్ తీసుకోవాలి. తరువాత



షూటింగ్ రోజు… డాక్టర్ వచ్చి, క్లియరెన్స్ తీసుకున్న జంతువూ, ఇప్పుడు స్పాట్‌లో ఉన్న జంతువూ ఒకటో కాదో వెరిఫై చేస్తాడు. తరువాత అది షూటింగ్‌లో పాల్గొనటానికి పూర్తి ఆరోగ్యంతో ఉందని సర్టిఫై చేస్తాడు. అలా చేస్తే కానీ షూటింగ్ కొనసాగదు. ఈ బాధలన్నీ పడలేక చాలామంది జంతువుల బదులు యానిమేషన్ ఇమేజెస్ వాడుతున్నారు.

"చిన్న పాప స్కూల్ డ్రస్‌లో ఉండాలి. ముసలి వ్యక్తి చేతిలో కర్ర, కళ్లకి నల్ల కళ్లద్దాలూ ఉండాలి. లేకపోతే స్ప్లిట్ సెకండ్ కనపడే షాట్ ప్రేక్షకుడి దృష్టిలో రిజిస్టర్ కాదు." వివరించాడు మహేష్.

"మొన్న మీరు చెప్పారు కదా. అంతా దాని ప్రకారమే చేశాం…" అన్నాడు స్టంట్ మాస్టర్ నరసింహం.

"కారు ఎవరు డ్రైవ్ చేస్తున్నారు? ఇది చాలా ముఖ్యమయిన షాట్ కదా! హీరోయిన్, స్వీటీ కూడా షాట్‌లో ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కొంపలంటుకు పోతాయి." అడిగాడు మహేష్.

"కారు నేనే డ్రైవ్ చేస్తాను సార్." చెప్పాడు నరసింహం.

"మీరు డ్రైవ్ చేస్తే ఇక ఆలోచించనవసరం లేదు. కానీ, ఇంకొకసారి చెప్తున్నాను. హీరోయిన్, స్వీటీ జాగ్రత్త. తేడా వచ్చిందంటే షెడ్యూల్ మొత్తం అప్‌సెట్ అవుతుంది."

"నో ప్రాబ్లమ్ సర్…" కాన్ఫిడెంట్‌గా చెప్పాడు నరసింహం.

రెండు గంటలు పట్టింది తరువాతి షాట్‌కి రెడీ అయ్యేటప్పటికి. నల్ల కళ్లజోడు పెట్టుకున్న ముసలి వ్యక్తిని చూసి నుదురు చిట్లించాడు మహేష్. "ఏమయ్యా! నరసింహాన్ని ఒక్కసారి పిలవండి." అన్నాడు చిరాగ్గా.

నరసింహం పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏంటయ్యా నరసింహం… ముసలి వ్యక్తి కావాలని చెప్తే మరీ ఇంత ముసలతన్ని పట్టుకొచ్చావ్. షాట్ అయ్యేవరకయినా నిలబడతాడా?"

"పర్లేదు సర్! మా మనిషే. అతనికి అలవాటే…" భరోసా ఇచ్చాడు నరసింహం.

"సరే కానియ్యండి. ఇంక ఆలస్యమెందుకు?" కాంప్రమైజ్ అవుతూ అన్నాడు మహేష్.

వేగంగా వస్తున్న ఇన్నోవాని, వెనుక తరుముకు వస్తున్న పోలీసు జీపుల్ని వేరే వేరే యాంగిల్స్‌లో రెండు మూడు షాట్లు తీశారు.



నరసింహానికి స్టంట్‌మాన్‌గా మంచి పేరుంది. కేవలం హీరోల గురించే కాకుండా తన వద్ద పనిచేసే అందరి క్షేమం ఆలోచించే మనిషంటారు. అన్నీ మరొకసారి సరిచూసుకున్న తరువాత కానీ అతను పని మొదలు పెట్టలేదు. అందుకే అతని కంపోజిషన్‌లో యాక్సిడెంట్లు చాలా తక్కువ జరుగుతాయని పేరు.

కారు బ్రేకు వేయగానే రెండు రౌండ్లు కొట్టి ఆగేటట్లు, నిన్నంతా అదే రోడ్డు మీద ప్రాక్టీస్ చేశాడు నరసింహం. ఎంత వేగంతో ఎక్కడ స్టార్ట్ అయితే ఎక్కడకొచ్చి ఆగుతుందో ముందు రోజే రిహార్సల్ వేసుకుని ఉన్నాడు.

డైరెక్టర్ స్టార్ట్ చెప్పేటప్పటికి హీరోయిన్, ఎక్స్ట్రా వర్కర్లు ఎక్కడ ఉంటారో అంచనా వేసుకుని, దానిని బట్టి తను ఎక్కడ నుండి బయలుదేరాలో మర్కింగ్ చేసుకుంటున్నాడు. అదే డైరెక్టర్‌కి వివరించాడు.

షాట్ స్టార్ట్ అయింది.

ఒక పక్క నుండి హీరోయిన్ స్వీటీని బెల్టు పట్టుకుని నడిపిస్తూ బయలుదేరింది. ఇంకొక వైపు స్టూడెంట్ వేషంలో ఉన్న చిన్న పాప ముసలి వ్యక్తిని రోడ్డు దాటిస్తోంది.

అసిస్టెంట్ నుండి సిగ్నల్ అందుకోగానే ఇన్నోవా స్టార్ట్ చేశాడు నరసింహం.

స్వీటీ 'గోల్డెన్ రిట్రీవర్' బ్రీడ్. బలంగా ఉంది. ఊగుతూ, ఠీవిగా ముందుకు నడుస్తోంది. దాదాపు అదే హీరోయిన్ని లాక్కెళ్తున్నట్లు ఉంది.

హీరోయిన్ సున్నితంగా కేకలు వేస్తోంది. "స్వీటీ స్లో డౌన్... స్లో డౌన్." అని.

ఒక్కసారిగా దూసుకు వస్తున్న కార్ల శబ్దం దాని చెవులకు చేరినట్లు ఉంది. సహజంగా కలిగే భయంతో స్వీటీ ఒక్కసారిగా హీరోయిన్ చేతిలో ఉన్న బెల్టును వదిలించుకుని ముందుకు దూకింది.

తన మీదకి దూకుతున్నట్లు వస్తున్న కుక్కని చూసి చిన్న పాప భయంతో ముసలి వ్యక్తి చేతిని వదిలి పక్కకి పరుగెత్తింది.



ఇన్నోవాలో దూసుకు వస్తున్న నరసింహానికి, దూరం నుండే ఏదో తేడా జరిగిందని అర్ధమయింది. స్వీటీ, యూనిఫాంలో ఉన్న పాపా, ముందు అనుకున్న స్థలంలో కాకుండా వేరే వైపుకు కదులుతూ కనిపించారు. దూసుకు వస్తున్న ఇన్నోవాని చూసి హీరోయిన్ ఏమి చెయ్యాలో అర్ధం కానట్లు రోడ్డు మధ్యలో నిలబడి పోయింది.

ముందు అనుకున్నట్లు ఇన్నోవాని ఎడమ వైపుకు తిప్పి సడన్ బ్రేక్ వేస్తే ఇన్నోవా స్వీటీ మీదకి దూసుకు వెళ్లే అవకాశం ఉంది. దానిని తప్పించాలంటే, ఇంకొక పక్కకి తిప్పవలసి ఉంటుంది. అప్పుడు ముసలి వ్యక్తికి, చిన్న పాపకి తగిలే అవకాశం ఉంది.

ఏమి చెయ్యాలో నిర్ణయం తీసుకునే లోపు మనసులో "హీరోయిన్, స్వీటీ జాగ్రత్త" అంటూ డైరెక్టర్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

అసంకల్పితంగా స్టీరింగ్ కుడి చేతి వైపు తిరిగింది.

(((((())))))

డైరెక్టర్ మహేష్ ఇంటి ఆవరణ హడావుడిగా ఉంది. కన్సీల్డ్ లైటింగ్‌తో లాన్ అందాలు ద్విగిణీకృతమయి కనిపిస్తున్నాయి. సినీ ఇండస్ట్రీలో ప్రముఖులందరు ఒక చోట చేరారేమో, ఆహ్లాదకరంగా నవ్వులు విరబూస్తున్నాయి.

మహేష్ డైరెక్ట్ చేసిన సినిమా సూపర్‌హిట్ అయి ఇంతకు ముందు ఉన్న రికార్డులన్నిటినీ బద్దలు కొట్టిన సందర్భంలో ఇస్తున్న పార్టీ ఇది.

రాత్రి పన్నెండు గంటలవుతోంది. నెమ్మది నెమ్మదిగా అతిధులందరు మహేష్‌ని అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నారు. ఆవరణంతా మెల్లగా ఖాళీ అవుతోంది.

నరసింహం చాలా సేపటి నుండి మహేష్‌ని పలుకరించటానికి వేచి ఉన్నాడు. అవకాశం చూసుకుని పలుకరించాడు. "కంగ్రాట్స్ సర్! ఇంతకు ముందు సినిమాలన్నిటినీ మించి పోయింది మీ సినిమా. రిలీజయి యాభై రోజులవుతున్నా ఇంకా కలక్షన్లు ఏమాత్రం తగ్గలేదు. నిజంగా చాలా పెద్ద హిట్..." అన్నాడు.



"థాంక్స్ నరసింహం. మీ అందరి సమిష్టి కృషి తప్ప, నా ఒక్కడి గొప్ప అని నేను అనుకోవటం లేదు. ముఖ్యంగా మీరు కంపోజ్ చేసిన ఫైట్ సీక్వెన్సెస్ గురించి అందరూ ఎలా చెప్పుకుంటున్నారో గమనించారా?"

"దాందేముంది సార్! మీరిచ్చిన ఐడియాలే కదా. కొంతమంది డైరెక్టర్లయితే యాక్షన్ పార్టంతా మా మీద వదిలేస్తారు. షూటింగ్ స్పాట్‌కి కూడా రారు. అలాకాకుండా మీరు పూర్తిగా ఇన్వాల్వ్ కాబట్టి ఔట్‌పుట్స్ ఇంత బాగా వచ్చాయి."

"సరే కానీ... ఆ రోజు షూటింగ్‌లో యాక్సిడెంట్ జరిగిన పాపకి ఎలా ఉంది?"

"ఆ రోజు యాక్సిడెంట్లో చనిపోయిన ముసలాయనకి పాప నిజంగా మనవరాలు సార్. వాళ్ళుండేది మా వీధిలోనే. ఆ పాప అమ్మా, నాన్నా దాని చిన్నపుడే ట్రైన్ యాక్సిడెంట్లో చనిపోయారు. ఆ కుటుంబానికి సరిగా రోజులు గడవక ఇబ్బంది పడుతుంటే అప్పుడప్పుడూ నేనే వాళ్ళకి కాస్త అయినా సాయం అవుతుందని ఇలాంటి చిన్న చిన్న పనులు ఇచ్చే వాడిని. ఆ రోజు వాళ్ళని పిలుస్తున్నపుడు అనుకోలేదు ఆ పనిలో ఇంత రిస్కు ఉందని."

"నిజమే! అట్లాంటి సీనులు ఎన్ని తీసి ఉంటారు. ఆ రోజు అలా జరిగి పోయింది..."

"ఏం చేయాలో ఆలోచించి తీసుకున్న నిర్ణయం కాదు సార్ అది. చివరి నిమిషంలో మీరన్న మాటలు గుర్తుకు వచ్చాయి. నేను కారును అటు తిప్పకపోతే, డైరెక్టుగా హీరోయిన్ మీదకి వెళ్లేది సార్. కానీ, నేను తీసుకున్న నిర్ణయం వల్ల ఒక చిన్న పిల్ల అవిటిదయి పోయింది. ఒక ముసలి ప్రాణం గాలిలో కలిసి పోయింది. ఆ సంగతులు గుర్తుకు వచ్చినపుడు మనసు ఏదోలా అయిపోతుంటుంది."

"యాక్సిడెంట్లన్నవి మనకి చెప్పి వచ్చేవి కావు. కాకపోతే ఇప్పుడు మనం ఆ కుటుంబానికి ఇంకేమన్నా చేయగలమా అని చూడాలి."

"ఆ కుటుంబంలో ఇంకా ఎవరున్నారు సార్, సాయం చేయటానికి. ఆ పిల్లని నేనే పెంచుకుంటున్నాను. నాకు చేతనయినంతలో ఆ పిల్లకి ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నాను."

"నేను రేపు ఇంకొక లక్ష రూపాయల చెక్ పంపుతాను. పాప పేరు మీద డిపాజిట్ చేయండి. తరువాత ఉపయోగపడుతుంది."

"మీరు ఒకరే ఎంతకని చేస్తారు సార్. ప్రొడ్యూసర్ గారు ఒక లక్ష రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. హీరోయిన్ గారయితే కనీస మానవత్వం కూడా చూపలేదు. సహాయం సంగతి పక్కన పెట్టండి, ఒకసారి ఆ పసిదాన్ని పరామర్శించటానికి కూడా ఒప్పుకోలేదు. అవిటివాళ్లని చూస్తే



అసహ్యమట. ఆ పాప ఆ రోజు షూటింగ్‌కి వచ్చిందే మేడమ్‌గారిని చూడటానికి సార్. ఆ పాపకి మేడమ్‌గారంటే పిచ్చి అభిమానం సార్…" చెప్తుంటే గొంతు బొంగురు పోయింది నరసింహానికి.

"ఊరుకో… అందరు ఒకలాగా ఉండరు కదా. మనమేమి చెయ్యగలమో ఆలోచించు. కలిసిరాని వారి గురించి ఆలోచించి ఉపయోగం ఏముంది?"

"లేదు సార్! నా బాధ డబ్బుల గురించి కాదు సార్. పాపకి పోయిన అవయవాన్ని ఎవరూ తెచ్చి ఇవ్వలేరు. కాస్త ఓదార్పు ఇవ్వవచ్చు కదా. కనీసం ఒక కుక్కకి ఇచ్చిన విలువ కూడా మనిషికి ఇవ్వటం లేదే అని తప్ప, ఆ పాపకి ఇప్పుడు తక్కువ ఏమీ కాలేదు. మీరిచ్చిన డబ్బు ఉంది. మా అందరి సహకారంతో త్వరగానే కోలుకుంటోంది."

మహేష్ ఒకసారి నరసింహం వైపు సాలోచనగా చూశాడు.

లాన్‌లో సామాను సర్దుతున్న పనివారు తప్ప అందరూ వెళ్లి పోయారు. అప్పటి వరకు హోరెత్తిన ఆవరణ అలా మూగ పోవటంతో… ఆ నిశ్శబ్దం గగుర్పాటు కలిగిస్తోంది.

"నీకొక విషయం చెప్తాను నరసింహం. ప్రాణం విలువ తెలిసిన వారికి అది కుక్క ప్రాణమయినా, మనిషి ప్రాణమయినా ఒకటే. సాటి మనిషిని గౌరవించలేని వారికి కుక్కని ప్రేమించే సంస్కారం మాత్రం ఉంటుందని ఎలా అనుకున్నావ్? ఒక కారు, ఒక బంగళా, ఒక నెక్లెస్ ఎలానో కుక్క కూడా అంతే…"

నరసింహం ఏమీ అర్థం కానట్లు మొహం పెట్టాడు.

ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు మహేష్. ద్వైదీభావం నుండి తేరుకుని ఆఖరికి చెప్పటానికే నిర్ణయించుకుని కొనసాగించాడు. "ఆ సంఘటన జరిగిన కొన్ని రోజులకి షూటింగులో హీరోయిన్ మూడీగా ఉండటం చూసి ఏంటని అడిగాను. స్వీటీకి ఒంట్లో బాగుండటం లేదని చెప్పింది. ఏమయిందని అడిగాను. ఒకరోజు వాళ్ల ఇంటికి తీసుకెళ్లి చూపించింది. తన శరీరమే తనకి భారమయినట్లు పడి ఉంది స్వీటీ. నడవలేక పోతోంది. ఆహారం తీసుకోక నీరసించి పోయింది. తెలిసిన డాక్టర్ దగ్గరకు మనిషిని ఇచ్చి పంపాను. ఒక వయసు తరువాత కుక్కల్లో వచ్చే ఆర్థరైటిస్ అని చెప్పాడు. దానికి మందు లేదనీ, అది బ్రతికినన్నాళ్లూ ఇక అంతేననీ చెప్పాడు."



"అయ్యో! ఇప్పుడు ఆ కుక్కకి... సారీ స్వీటీకి ఎలా ఉంది?"

"ఎంత మూర్ఖుడివయ్యా నరసింహం! ఈ రోజుల్లో తమ పనులు తాము చేసుకోలేకపోతే స్వంత తల్లితండ్రుల్నే చూడటం లేదు. ఇక కుక్కల్ని సంరక్షించేదెవరు? రెండు రోజుల తరువాత మరలా ఆ డాక్టరు దగ్గరకి స్వీటీని పంపారు. ఈ సారి అది తిరిగి రాలేదు. ఒక్క ఇంజెక్షన్‌తో సమస్య సాల్వ్ అయిపోయింది. అఫ్‌కోర్స్ డాక్టర్ దగ్గరకు పంపే ముందు రకరకాల యాంగిల్స్‌లో దాన్ని ఫొటో తీయించటం మరచి పోలేదు – మరుసటి రోజు పేపర్లో చనిపోయిన కుక్కల కాలమ్‌లో వేయించటానికి..."

"......"

"కాబట్టి ఇంకెప్పుడూ కుక్కకిచ్చే విలువ కూడా మనిషికి ఇవ్వటం లేదని అనకు. అవసరం లేని మనిషిని అలా చంపాలంటే ఇంకొంత సమయం పడుతుందనుకుంటా..." అన్నాడు మహేష్.

సమాప్తం